క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



శస్త్ర చికిత్సలకు తరలి వెళ్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని కోమర్తిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో వైద్య శిబిరం జరిగింది. ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి గొలివి సుజాత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. దీంట్లో 56 మందికి పరీక్షలు నిర్వహించి, 25 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ మేరకు రోగులను ఆపరేషన్ల కోసం తరలించారు. శంకర్ ఫౌండేషన్‌కు చెందిన ఆప్తాలమిక్ ఆఫీసర్ వివేక్ కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు కో–ఆర్డినేటర్ అశ్విని కుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితా వెల్లడి



ఓటరు ముసాయిదాను వెల్లడిస్తున్న రెవెన్యూ సిబ్బంది

హిరమండలం: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితాను తహసీల్దార్ హనుమంతురావు ఆదివారం వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 10 సాగునీటి సంఘాల పరిధిలో 72 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. వీటిలో మెత్తం 5,325 మంది రైతు ఓటర్లు ఉన్నారని తెలిపారు. కోరాడ, అంబావల్లి మేజర్ ఇరిగేషన్ సంఘాలు, గులుమూరు, ధనుపురం, నౌగుడ, కొండరాగోలు, దుర్బలాపురం, రుగడ, కొమనాపల్లి, జగన్నాథపురం మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 21న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాలీ ఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి



ప్రహరాజపాలేంలో సాగు చేస్తున్న కాలీ ఫ్లవర్ పంట

పాతపట్నం: మండలంలో పలు గ్రామాల్లోని రైతులు కూరగాయల పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కూరగాయల పంట సాగులో భాగంగా కాలీ ఫ్లవర్ (క్యాబేజీ) సాగుపై ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పాతపట్నం, ప్రహరాజపాలేం, కొరసవాడ, శివరాంపురం, బోరుభద్ర, సీతారాంపల్లి, చంగుడి, పాతపట్నం తదితర గ్రామాల్లో కాలీ ఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి అనుకూల వాతావరణం ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అంటున్నారు.

మద్యం అమ్మకాలకు వేలంపాటలు

నరసన్నపేట: ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల ద్వారా మద్యం అమ్మకాలు ప్రారంభించిన తర్వాత బెల్ట్ షాపులు అధికమవుతున్నాయి. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో అమ్మకాలకు సంబంధించి వేలంపాటలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వేలంపాటలకు రూ.లక్షల్లో చెల్లిస్తున్నట్లు సమాచారం. కాగా మరోవైపు ఎక్సైజ్ సిబ్బంది అమ్మకాలపై నిఘా పెంచామని, దాడులు చేస్తున్నామని బెల్ట్ షాపులు నిర్వహించవద్దని హెచ్చరిస్తున్నారు. సీఐ రమణమూర్తి ఈ మేరకు ప్రకటన చేశారు. కేసులు పెడుతున్నట్లు వివరించారు.

దేవాలయాల రక్షణ బాధ్యత హిందువులందరిది



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: సనాతన ధర్మం పరిరక్షణ, దేవాలయాల రక్షణ బాధ్యత హిందువులందరిదని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు బగాది భాస్కరరావు అన్నారు. స్థానిక పాలపోలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆమదాలవలస ఖండ విభాగ్ సమావేశంలో ఆయన అధ్యక్ష ప్రసంగం చేశారు. ప్రభుత్వాల ద్వారా హిందూ దేవాలయాల నిర్వహణ చేయడం భారత రాజ్యాంగంలో 12, 25, 26 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, ఇది హిందూ విశ్వాసాలపై తీవ్రదాడి కిందికి వస్తుందన్నారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని సాధించేందుకు హిందువులంతా కలసి ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. భాగ గోసేవా ప్రేముఖ్ చింతు పాపారావు, విభాగ సేవాభారతి ప్రముఖ్ కసుగుల సత్యంలు హైందవ శంఖారావం సమావేశానికి దిశా నిర్దేశం చేశారు. సనపల లక్ష్మణరాజు సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో దన్నాన లక్ష్మి, ఓ.రాజేశ్వరి, ప్రఖండ సంఘటన కార్యదర్శి గొంటి రాము, బజరంగ్ దళ్ ఆముదాలవలస సంయోజక్ కుప్పిలి గజపతి తదితరులు పాల్గొన్నారు.

కరకట్టాలు..!



లక్ష్మీనర్సుపేట వద్ద వంశధార నది నీటి ప్రవాహానికి కోతకు గురైన తోటలు

- వంశధార తీరంలో ముంపునకు గురవుతున్న భూములు
- కరకట్టలు లేకపోవడంతో ఇబ్బందులు
- తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు

కోతకు గురవుతున్న భూముల వివరాలు				
మండలం	నదీతీరం (కి.మీ)	తీరప్రాంత గ్రామాలు	కోతకు గురైన భూములు	బాధిత రైతులు
కొత్తూరు	18	14	58 ఎకరాలు	128 మంది
హిరమండలం	10	12	19 ఎకరాలు	47 మంది
ఎల్.ఎన్.పేట	13	09	21 ఎకరాలు	62 మంది



వాడవలస వద్ద వంశధార నది వరద ప్రవాహానికి కోతకు గురైన పంట పొలం

ఎల్.ఎన్.పేట: వంశధార నదీతీరంలో పంట భూములు, తోటలు ఉన్న రైతులకు సంతోషించాలో, బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొంది. నదీతీరంలో పుష్కలంగా నీరు లభిస్తున్నా, కరకట్టలు లేకపోవడంతో విలువైన పంట భూములు, చేతికి అందివచ్చే పంటలు, పండ్ల తోటలు ప్రతీ ఏడాది వచ్చే వరదలు కారణంగా నదిలో కలిసిపోతున్నాయి. నదికి వరద వచ్చిందంటే పంట భూములు కోతకు గురవుతూనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో రైతులకు భూములు ఉంటాయి. కానీ వాస్తవానికి ఆయా భూములు వంశధార నది నీటి ప్రవాహంతో కోతకు గురై నదిలోనే ఉంటాయి. ఇసుక మేటలు వేసి ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. దీంతో భూములు ఉన్న రైతులు కూలీలుగా మారిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని కరకట్టలు నిర్మించాలని కోరుతున్నారు.

వర్షాకాలం వస్తే గండమే



వర్షాకాలం వచ్చిందంటే వంశధార తీర ప్రాంతంలో ఉన్న రైతులకు గండమే. వరద నీటి ప్రవాహ వేగానికి ఎంతో విలువైన పంట భూములు, తీరంలో ఉన్న తోటలతో పాటు పంటలు, చెట్లు కూడా నదిలో కలిసిపోతాయి. నీటి ప్రవాహానికి భూములు కోల్పోయి, పంటలు, చెట్లు కోల్పోయి ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాము. ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి ఉంటుంది.

బ్రజోకుమార్ పాణిగ్రహి, రైతు, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

నియోజకవర్గంలో...

- పాతపట్నం నియోజకవర్గంలో కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలు వంశధార నదీతీరంలో ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో 41 కిలోమీటర్ల నదీ తీరం ఉంది.
- కొత్తూరు మండలంలోని సిరుసువాడ, ఆకులతంపర, మాకవరం, పెనుగొటివాడ, వి.ఎన్.పురం, మాతల, కుద్దిగాం, బంకి, పానుటూరు, కుంటిభద్ర, వసప, మదనాపురం, రామకృష్ణాపురంతో పాటు మరి కొన్ని గ్రామాలు నదీతీరంలో ఉన్నాయి.
- హిరమండలం మండలంలోని గులుమూరు, కొండరాగోలు, గొట్ట, తుంగతంపర, దుర్బలాపురం, హిరమండలం, పాత హిరమండలం, అంబావిల్లి, అక్కరాపల్లి, రెల్లివలస, భగీరథపురం, భగీరథపురం కాలనీ తదితర గ్రామాల భూములు నదీ తీరంలో ఉన్నాయి.
- ఎల్.ఎన్.పేట మండలంలోని స్కాట్‌పేట, మోదుగువలస, బసవరాజుపేట, పెద్దకోట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, సీతారాంపురం తదితర గ్రామాలను దాటి సరుబుజ్జిలి మండలంలో వంశధార నది ప్రవేశిస్తుంది.

కరకట్టలు కట్టాలి



వంశధార నదికి వచ్చే వరదల నియంత్రణ కోసం తీరంలో కరకట్టలు నిర్మించాల్సి ఉంది. కరకట్టలు నిర్మిస్తే పంటలకు, పంట భూములకు నష్టం జరగదు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వంశధార నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే, తీరంలో ఉన్న భూములు కోతకు గురై నదిలో కలిసిపోతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి నదీ తీరంలో కరకట్టలు, నదిలో రాతి కట్టలు కట్టాలి.

రౌతు శ్రీనివాసరావు, రైతు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ రెడ్‌బుక్ పాలన నడుస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఐదు నెలలుగా మన రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి నాయకులు కక్షకట్టి దాడులు చేయడం, ఆస్తులు నష్టపరచడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కంటే, కూటమి పార్టీలకు వ్యతిరేకంగా పనిచేసిన వారిపై కక్షసాధించడమే ప్రధాన ధ్యేయంగా పాలన నడుస్తోందన్నారు. పలాస–కాశీబుగ్గలో పోలీసుస్టేషన్‌లోనే వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని బలగ ప్రాంతంలో ఇసుక అక్రమాలపై ప్రశ్నించారని కారులో వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసిన టీడీపీ నాయకులపై ఎలాంటి చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో మహిళలు స్వేచ్ఛగా తిరగలేని దౌర్భాగ్యం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన దిశ చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదని హోం మంత్రి అనితను ప్రశ్నించారు. మహిళలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎన్నికల ముందు ఎన్నో కబుర్లు చెప్పిన పవన్ కల్యాణ్, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు పక్కన పెట్టి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి



ప్రతిభ కనబర్చిన చిన్నారులతో స్వామి పరమాత్మానంద తదితరులు

నరసన్నపేట: ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం అలవర్చుకోవడం వలన జ్ఞానం, ప్రశాంతమైన జీవనం పొందవచ్చని స్వామి పరమాత్మానంద అన్నారు. స్థానిక చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో చిన్మయి సుగుణంలో జిల్లాస్థాయి భగవద్గీత పఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. గడిచిన ఏడాది కాలంగా 35 స్కూల్స్‌లో ఈ పోటీలు దశల వారీగా నిర్వహించగా 3500 మంది పాల్గొన్నారు. వీరి నుంచి 90 మందిని ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలతో భగవద్గీత పఠనం చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కాగా ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో శ్రీవేద, బీవీకే, కలాం బ్లోజర్స్, ఇన్‌స్పైర్ స్కూల్స్‌తో పాటు శర్వాణీ, గాయత్రి, శ్రీజ్ఞానజ్యోతి, డీపీఎస్, ఆక్స్‌ఫర్డ్, రవీంద్రభారతి, అమృత సాయి స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో గీతాన్విత, బి.రోహన్, పి.రుషిత ప్రియ, వి.సాయి శహన్, సీహెచ్ పూజ్యశ్రీ, ధనుష్యలు ప్రతిభ చూపారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 15 నుంచి కడపలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం, స్థానిక ప్రతినిధులు కేఎల్‌ఎన్ మూర్తి, సోమేశ్వరరావు, వేంకటేశ్వర్లు, జామి రామచంద్రరావు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పాతపట్నం: ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం కావడంతో అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో త్రినాథ స్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. కార్తీకమాసం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పురోహితులు మనోజ్ శర్మ భక్తులచే ప్రత్యేక, విశేష పూజలు చేయించారు.



సారవకోట: స్వామివారికి పూజలు చేస్తున్న మహిళలు

వేతనాలు జమ

నరసన్నపేట: జిల్లాలో 104, 108 వాహనాల సిబ్బందికి రెండు నెలల వేతనాలు వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయి. మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో వేతనాలు జమ కావొచ్చని 104 వాహనాల పర్యవేక్షకుడు లక్ష్మణరావు తెలిపారు. 104 సిబ్బందికి కొందరికి ఒక నెల, మరికొందరికి రెండు నెలలు వేతనాలు వచ్చాయన్నారు. అలాగే 108 సిబ్బంది 150 మందికి రెండు నెలల వేతనాలు ఖాతాలకు జమ అయ్యాయన్నారు. 102 వాహనాలకు చెందిన 14 మంది డ్రైవర్లుకు కూడా మంగళవారం నాటికి వేతనాలు జమ కావచ్చని తెలిపారు.

మండల స్థాయి పోటీలు నేడు

పొందూరు: స్థానిక యంగ్‌స్టార్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలు సోమవారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్లకూరి శాంతారాం, ఆట్ల చంద్రశేఖర్‌లు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు దివ్యజ్ఞాన సమాజంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఉంటాయని చెప్పారు. 4, 5 తరగతుల విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి, పాఠశాలకు ఒక గ్రూపు మాత్రమే హాజరుకావాలని కోరారు. గెలిపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని చెప్పారు.

ఉచిత ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు రేపు

కొత్తూరు: ఈనెల 12వ తేదీన రాజాంలోని సైరేడ్‌లో ఉచిత ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు 18 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షలు పాసైన పురుషులకు రిఫ్రిజిరేషన్, ఏసీ రిపేరింగ్, జెంట్స్ టైలరింగ్, హౌస్ వైరింగ్ అండ్ ఫ్యాన్ వైండింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పదో తరగతి పాసైన స్త్రీలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, హోమ్ నర్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసైన స్త్రీలకు కంప్యూటర్ ట్యాలీలో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 99899 53145 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నారాయణ సేవ



ఆహారం అందజేస్తున్న శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామంలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న 21 కుటుంబాలకు నారాయణ సేవలో భాగంగా ఆహార ప్యాకెట్లు ఆదివారం అందజేశారు. శ్రీసత్య సాయి సేవా సమితి కన్వీనర్ సీహెచ్ సూర్యారావు సాయి ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం గ్రామంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఐ.పోలినాయుడు, ఉప్పినివలస భజన మండలి కన్వీనర్ అల్లాడ సింహాచలం, మానేం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అఖండనామ సంకీర్తన


హిరమండలం: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్యసాయి మందిరంలో 24 గంటల పాటు అఖండనామ సంకీర్త కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంకీర్తన కార్యక్రమంలో ఆరు సత్య సాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జోనల్ కన్వీనర్ చంటి మాస్టర్, కన్వీనర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో తోలాపి గ్రామంలోని సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి 24 గంటల అఖండ నామ సంకీర్తన జరుగుతోంది. ఆదివారం ఉదయం 6 గంటలకు సంకీర్తన ప్రారంభమైంది. సోమవారం ఉదయం 6 గంటలకు పూర్తవుతుంది. పరిసర గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి.



హిరమండలం: అఖండ నామ సంకీర్తన చేపడుతున్న సాయి భక్తులు

అధ్వానం



సారవకోట మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తీర్ణ పనులు, పలుచోట్ల కల్వర్టుల నిర్మాణ పనులు జరిగాయి. అయితే అనంతరం ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - సారవకోట

పేరుకుపోయిన గుర్రపు డెక్క



ఎల్.ఎన్.పేట మండలంలోని సుమంతాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపక్కన ఉన్న పరమట చెరువులో గుర్రపు డెక్క తొలగించాలని గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. వంశధార 11 ఎల్ ప్రధాన కాలువ పక్కనున్న ఈ చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఫలితంగా నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, పంట పొలాలకు సాగునీరు వెళ్లకుండా కాలువల్లో గుర్రపుడెక్క అడ్డంకిగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెరువులో గుర్రపు డెక్క తొలగించాలని కోరుతున్నారు. - ఎల్.ఎన్.పేట

రోడ్డుపైకి మురుగు నీరు



నరసన్నపేట మండలం మడపాం పంచాయతీ కొత్తపేటలో మురుగు నీరు రోడ్డుపైకే వస్తోంది. మురుగు నీటి డ్రైన్ జామ్ కావడంతో కొత్తపేట ప్రధాన వీధి గృహస్తుల వాడుక నీరు అధికమైతే రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ అవ్వడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - నరసన్నపేట

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తూరు: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎంఏ అహ్మద్ సూచించారు. మండలంలోని మహసింగి గ్రామంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఇటీవల కాలంలో బ్యాంకు ఖాతాలు నుంచి ఖాతాదారులకు తెలియకుండా విత్ డ్రాలు కావడం వంటివి జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున క్యాంప్‌లు వెళ్లినప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదన్నారు. వీటితో పాటు పలు నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అహ్మద్

రహదారి భద్రత పాటించండి

ఆమదాలవలస: వాహనదారులు రహదారులపై ప్రయాణించేటప్పుడు సరైన భద్రత పాటించి గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని ఎస్ఐ కె.వెంకటేష్ సూచించారు. మండలంలోని సైలాడ గ్రామ పంచాయతీ కుమ్మరిపేటలో ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాల ద్వారా ఎంతోమంది అమాయకులు వివిధ రకాలుగా నష్టపోతున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు పోలీసులు రవాణా శాఖ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా మైనర్ బాలబాలికలు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు డ్రైవింగ్ చేయకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సైలాడ దాసునాయుడు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సత్తాచాటిన బాలికలు

ఆమదాలవలస: శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఆమదాలవలసకు చెందిన నలుగురు బాలికలు సత్తాచాటి పతకాలు గెలుచుకున్నారు. ఒకరికి బంగారు పతకం, ముగ్గురికి వెండి పతకాలు వచ్చినట్లు కోచ్ ఎస్ఎంపురం నాగలక్ష్మి తెలిపారు. బెండి నిఖిలప్రియ బంగారు పతకం సాధించగా, తమ్మన వెంకట నాగ దేవన్షి, బెండి నిఖిలప్రియ, కంచరాన భారద్వాజ్‌లకు వెండి పతకాలు వరించాయి. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ప్రకాశం జిల్లాలో జరుగుతాయని తెలిపారు. వీరికి తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు.



విజేతలుగా నిలిచిన ఆమదాలవలస బాలికలు